క్లుప్తంగా

చంద్రబాబుకు ఘనస్వాగతం



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం/శాంతిపురం: నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నారా చంద్రబాబునాయుడు తొలిసారిగా కుప్పం వచ్చారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం గన్నవరం నుంచి బెంగళూరుకు విమానంలో చేరుకున్న బాబు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కుప్పం పీఈఎస్ కళాశాలకు చేరుకున్నారు. అక్కడ చంద్రబాబుకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం డీఐజీ షిమోషీ, జిల్లా ఎస్పీ మణికంఠ, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, గురజాల జగన్‌మోహన్‌రెడ్డి, థామస్, గాలి భానుప్రకాశ్, ఆదిమూలం, పులివర్తి నానితో పాటు తెలుగుదేశం నేతలు, జిల్లా అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

సొంతింటి నిర్మాణ పనుల పరిశీలన

అక్కడి నుంచి 7వ మైలు మీదుగా కుప్పం వెళ్లిన చంద్రబాబు కడపల్లె సమీపంలో నిర్మాణంలో ఉన్న తన సొంతింటిని పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

సీఐలు బాధ్యతల స్వీకరణ



జీటీ నాయుడు



మల్లేష్ యాదవ్

కుప్పం: కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు, రూరల్ సీఐగా మల్లేష్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న అర్బన్ రమణ, రూరల్ ఈశ్వర్ రెడ్డి బదిలీ కావడంతో వారి స్థానంలో అనంతపురంలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నుంచి జీటీ నాయుడు, కల్యాణ దుర్గంలోని పోలీస్ శిక్షణ సెంటర్ నుంచి మల్లేష్ యాదవ్ నియమితులయ్యారు.

సెలవులో పలు శాఖల అధికారులు

పుంగనూరు: తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులపై ఒత్తిళ్లు మొదలవడంతో పలువురు అధికారులు సెలవు పెట్టి వెళ్లిపోతున్నారు. బోయకొండ గంగమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి గత వారం సెలవుపై వెళ్లడంతో ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు సైతం వాయిదా పడింది. అలాగే మున్సిపాలిటీ టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి సెలవుపై వెళ్లారు. తాజాగా పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, ఎస్‌ఐ రఫీక్ అహమ్మద్ మెడికల్ లీవ్‌పై సోమవారం వెళ్లారు. పుంగనూరులో ఉన్న ఎస్‌ఐ సుబ్బారెడ్డిని కూడా రేపో మాపో సెలవుపై పంపేస్తారని ప్రచారం మొదలైంది.

వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే టీడీపీ లక్ష్యం



నాగరాజు

వి.కోట: వలంటీర్ల వ్యవస్థ నిర్వీర్యం చేయడానికే టీడీపీ ప్రభుత్వం యత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తామని, వారికి 10 వేల రూపాయలు గౌరవవేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారని విమర్శించారు. జూలై 1న సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలని కేబినెట్‌లో నిర్ణయించడం చూస్తే ఈ వ్యవస్థను కొనసాగిస్తారా? లేదా? అనేది ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని మసిపూసి మారేడు కాయ చేసిన చందాన కాకుండా చిత్తశుద్ధితో సీఎం చంద్రబాబు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హర్షం



మాట్లాడుతున్న అశోక్

పుంగనూరు: ప్రభుత్వం విదేశీవిద్యకు అందించే ఆర్థిక సహాయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడం అభినందనీయమని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్ అశోక్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన దళిత నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ ఓవర్‌సీస్ నిధిని ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ నిధులు నూరు శాతం ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, భాస్కర్, పరమేష్, ఈశ్వర్, రెడ్డెప్ప, మంజు, శేఖర్ తరితరులు పాల్గొన్నారు.

రైతుల ఆశలన్నీ ‘ఆరుద్ర’పైనే..!

- రాలని చినుకు
- సాగని ఖరీఫ్ పనులు

బైరెడ్డిపల్లె: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అదునులో పుష్కలంగా వర్షాలు కురవాలి. మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర కార్తె ఆరంభమైంది. ఈ కార్తెలో వర్షాలు కురుస్తాయని రైతులు ఎదురుచూస్తున్నారు. జూలై 15 లోపు పంటల సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. మృగశిర కార్తె కంటే ముందే తొలకరి జల్లులు పలకరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. అయితే తొలకరి జల్లులు పది రోజుల క్రితం కురిశాయి. సరైన వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కొంత మంది రైతులు తొలకరి వర్షాలకే వేరుశనగ విత్తనాలు వేసేందుకు సిద్ధమై ఎండు దుక్కుల్లోనే వేశారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 6వేల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటిదాకా కేవలం 1.450 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ, కంది, అనుముల పంటలు వేశారు. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఆరుద్ర కార్తె పైనే ఆశలు పెట్టుకోవాల్సి వచ్చింది. ఓవైపు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకున్నారు. మరో వైపు సాగుకు నేలను సారం చేసి దుక్కులు దున్నడం సైతం పూర్తి చేశారు. ఇలాంటి సమయంలో వరుణుడు మొహం చాటేస్తుండడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీఫ్ పనులు కాస్త మందగించాయి. ఆరుద్ర కార్తెలో వరుణుడు కరుణిస్తే విత్తనాలు వేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు.



బైరెడ్డిపల్లె వద్ద ఎండు దుక్కుల్లోనే గింజలు వేస్తున్న రైతు

జూలై 15 వరకు అనుకూలం

ఖరీఫ్ సీజన్ జూలై 15 వరకు సమయమున్నందున రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. వర్షాలు ఎప్పుడు పడినా విత్తుకోవచ్చు. రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు ముందుగానే పంపిణీ చేశారు. ఈ కార్తె నుంచే పదును వర్షాలు కురుస్తాయని భావిస్తున్నాం.

– గీతాకుమారి, వ్యవసాయశాఖాధికారిణి

అభివృద్ధి, పరిపాలన సంతృప్తికరం

- మున్సిపల్ ఆర్డీ మూర్తి

పుంగనూరు: మున్సిపాలిటీలో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు సంతృప్తికరంగా సాగుతున్నాయని అనంతపురం మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి తెలిపారు. మంగళవారం కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలసి పలుశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. అలాగే పట్టణంలోని ఎన్‌ఎస్ పేటలో సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ పార్కును ఆర్డీ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన బెంచీలపై ఆయన సేదతీరారు. పార్కు పనులను పరిశీలించారు. అన్ని శాఖల్లోనూ పారదర్శకంగా పనులు చేస్తున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పారిశుధ్యం, మంచినీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ పార్కును పరిశీలిస్తున్న ఆర్డీ మూర్తి, కమిషనర్

కల్యాణ వైభోగమే..!

- కనుల పండువగా కోనేటిరాయస్వామి కల్యాణోత్సవం



ఆలయంలో నిర్వహిస్తున్న కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. తరువాత శాస్త్రోక్తంగా వేదపండితులు కల్యాణోత్సవం నిర్వహించి, ఉత్సవమూర్తులపై తలంబ్రాలు కురిపించి, మహా మంగళ హారతులు సమర్పించారు. భక్తులు ఇద్దరికి చొప్పు న రూ. 300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. ఆ తర్వాత గ్రామ వీధుల్లో గ్రామోత్స వం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, హర్షదీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయరూ!

పుంగనూరు: బ్రాహ్మణుల శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయాలని అసోసియేషన్ నాయకుడు శంకర, మురళి కోరారు. మంగళవారం కమిషనర్ నరసింహప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు లేకపోవడంతో అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని నివేదించారు.

వైభవంగా మోహినీ ఉత్సవం



టి.పుత్తూరులో నిర్వహిస్తున్న మోహినీ ఉత్సవం

- భక్తిప్రపత్తులతో చక్రస్నానం, వసంతోత్సవం, ఉట్లోత్సవం

తవణంపల్లె: టి.పుత్తూరులోని శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మోహినీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో వేదపండితులు ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం సంతపేటకు చెందిన ఉభయదారులు రఘు కుటుంబసభ్యులు స్వామికి తిరుమంజనం, ఉభయకర్త ఈశ్వరి కుటుంబసభ్యులు పాలాభిషేకం చేయించారు. మధ్యాహ్నం ఉభయదారులు రాజారెడ్డి కుటుంబసభ్యులు మోహినీ ఉత్సవానికి పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. సాయంత్రం ఉభయదారులు రాజేష్‌కుమార్ రెడ్డి కుటుంబసభ్యులు ఉట్లోత్సవాన్ని నిర్వహించారు.

చక్రస్నానం

సాయంత్రం ఉభయదారులు రవిచంద్రారెడ్డి కుటుంబసభ్యులు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో వేదపండితులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు.రాత్రి వైభవంగా ధ్వజావరోహణం చేయించారు. అనంతరం స్వామి ఏకాంత సేవతో సేదదీరారు.

నేడు సూర్యప్రభ వాహనం సేవ

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఉయ్యాలసేవ, రాత్రి సూర్యప్రభ వాహనం సేవ నిర్వహించనున్నట్టు తెలియజేశారు.



ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న వేదపండితులు



స్వామి వారికి హారతులిస్తున్న వేదపండితులు, పూజల్లో పాల్గొన్న ఉభయదారులు

ఇంటర్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదలతో సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు అన్నారు. ఇంటర్మీడియెట్ 2024 పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు చిత్తూరులో మంగళవారం ఆయన నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. చిత్తూరు జిల్లా మొదటి ర్యాంక్ సాధించి విద్యార్థిని కే.మౌనిక, చిత్తూరు టౌన్ మూడవ ర్యాంకు సాధించిన టి.దీపికకు, అలాగే కన్నన్ స్కూల్లో పదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన సంతోషిణికి రూ.5వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేసి ఆయన అభినందించారు.

పాడిపశువులపై శ్రద్ధ పెట్టాలి

బంగారుపాళెం: రైతులు పాడిపశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆసీఫ్ అన్నారు. స్థానిక పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం ఇండియన్ హెర్బ్స్, కారస్ లేబొరేటరీ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. చూలు నిలవని 60 పశువులను డాక్టర్ ఆసీఫ్ చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

చిత్తూరు కార్పొరేషన్‌లో అవినీతిని అరికట్టాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు కమిషనర్ అరుణ కన్నుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపించారు. ఫొటోలు, ప్రచార ఆర్భాటాలకే ఆమె పరిమితమయ్యారన్నారు. నగరపాలక సంస్థపై ఆమెకు కనీస అవగాహన లేదన్నారు. ఈమె మాతృసంస్థ మునిసిపాలిటీ కానప్పటికీ ఇక్కడే ఎందుకు కొనసాగుతున్నారో ఆశ్చర్యంగా ఉందన్నారు. సంస్థలోని వివిధ శాఖల్లో తనకంటూ ఓ వ్యక్తిని నియమించుకుని వారి ద్వారా ప్రతి పనికీ డబ్బులు తీసుకుంటున్నారని, తన మాట వినని కింది స్థాయి సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే సీనియర్ సిబ్బందికి ఉద్యోగోన్నతి ఇవ్వకపోగా.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. పారిశుధ్య కార్మికుల పేరిట తప్పుడు బిల్లులు పెట్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని చెప్పారు. హెల్త్ సెక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, మెప్మా విభాగంలో గోపి అనే ఇద్దరు అధికారుల అవినీతి పెచ్చుమీరిపోయిందని.. కమిషనర్‌కు వీళ్లిద్దరూ బినామీలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ జరిగిన అవినీతిపై అన్ని సాక్ష్యాధారాలను సేకరించామని, త్వరలోనే వాటిని వెల్లడిస్తామన్నారు. కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలపై కలెక్టర్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు నాగరాజు, ధనంజయరావు, లోకనాథం, రాజకుమార్, దాసరి చంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఐరాల: గర్భిణుల ఆరోగ్యం విషయంలో వైద్యసిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్‌హెచ్‌ఎం టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు డీపీఓ రామ్మోహన్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని మొరంపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం సందర్శించారు. గర్భిణులకు చేస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణుల హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్ష చేసి రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎంఐస్ రికార్డులను ధ్రువీకరణ చేశారు. అనంతరం ఆయన ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సెక్టార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత, పీహెచ్‌ఎన్ జీవకళ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ రామ్మోహన్

- ఎన్నికల్లో గెలుపోటములు సహజం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి

ఎదురొడ్డి పోరాడుదాం



1-25 డివిజన్ నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కష్టకాలంలో ఎదురొడ్డి పోరాడుదాం... ఎప్పుడూ కాలం ఇలాగే ఉండదు.. గతంలో ఎన్నో మంచి పనులు ప్రజలకు చేశామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 1–50 డివిజన్ల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేశారని, అయితే ఓటమికి కుంగిపోతే ముందుకు సాగలేమన్నారు. చిత్తూరులో స్వల్ప ఓట్లతో ఓటమి చెందామన్నారు. అధికార పక్షం పనిగట్టుకుని దాడులు చేయడం సరికాదని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. నాలుగు నెలల్లో జగనన్న బాధితుల ఇంటికి వచ్చి భరోసానిస్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై అపోహలు వద్దని, ఇప్పుడు చట్ట ప్రకారం ఎన్నికలు పెట్టలేరన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను తీర్చకపోతే వారి తరఫున ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అందరూ సంఘటితంగా ఉంటూ పార్టీని కాపాడుకుందామని మేయర్ అముద అన్నారు. దాడులకు భయపడవద్దని, తామంతా అండగా ఉంటామని చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి అన్నారు. తన కారును ధ్వంసం చేస్తే కేసు పెట్టినట్లు చెప్పారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, ఇప్పుడు వారిని అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కక్ష సాధింపుతో ఇలా చేస్తున్నారనేది ప్రజలూ గ్రహిస్తున్నారన్నారు. అందరూ సమన్వయంతో పనిచేద్దామని పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, నాయకులు, కార్పొరేటర్లు సూర్యప్రతాప్, రాహుల్‌రెడ్డి, రాంగణేష్, సరళమేరి, భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, మధురెడ్డి, చల్లాముత్తు, పూమణి, ప్రేమ్, బాలసుబ్రమణ్యంరెడ్డి, శివ, మనోహర్, బాబీ, మనోజ్‌రెడ్డి, అన్బు, ప్రకాష్, రాజేంద్ర, సయ్యద్, చాన్‌బాషా, బాబ్లూ, నారాయణ, శరవణ, గణేష్, అల్తాఫ్, శివారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పటాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



అమ్మవారి ఆలయం ముందు వేసిన చలువ పందిళ్లు



విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన అమ్మవారి కటౌట్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామం గంగజాతరకు ముస్తాబైంది. విద్యుత్ దీపాలంకరణలతో వీధులన్నీ కొత్తకాంతులీనుతున్నాయి. భారీ ఏర్పాట్లతో గంగమ్మ దర్శనమిచ్చేందుకు సిద్ధమైంది. మంగళ, బుధవారాల్లో గంగజాతరను అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. గ్రామం నలువైపులా అమ్మవారి విద్యుద్దీపాల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం అర్ధరాత్రి శిరస్సు ఊరేగింపుతో జాతర ప్రారంభం కానుంది. బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

గంగమ్మా..కరుణించమ్మా!



గోనుమాకులపల్లెలో అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



భారత్ నగర్‌లో పూలగెరిగతో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తుడు

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లె, భారత్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతరను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోనుమాకులపల్లె గ్రామస్తుల ఆహ్వానం మేరకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఇక, సోమవారం రాత్రి నుంచే మహిళలు పొంగళ్లు పెట్టారు. దీపారాధన చేశారు. అలాగే అమ్మవారి శిరస్సును పూలగెరిగ, డప్పులు, బాణసంచా వేడుకలతో కోలాహలంగా ఊరేగించారు. మంగళవారం ఉదయం భారత్‌నగర్‌లో ఓ కళాకారుడు ఎలాంటి ఆధారం లేకుండా తలపై రోకలిని నిలబెట్టి, దానిపై నీళ్ల బిందెను ఉంచి నృత్యం చేశాడు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనానికి వందలాది మంది భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తమ మొక్కులు చెల్లించారు. అన్నదానం చేశారు.

వెప్పాలమానుచేనులో ‘ఫ్యామిలీ డాక్టర్’



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమహేష్, వైద్య సిబ్బంది

గుడిపాల: మండలంలోని వెప్పాలమానుచేనులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రమహేష్ రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారిని పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కవిత, చంద్ర, ప్రభావతి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

30న హిందూ సామ్రాజ్యోత్సవ యాత్ర

పుంగనూరు: పట్టణంలోని ఎన్‌ఎస్ పేటలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈనెల 30న హిందూ సామ్రాజ్యోత్సవ యాత్ర ప్రారంభిస్తున్నట్లు ప్రతినిధి త్రిమూర్తిరెడ్డి మంగళవారం తెలిపారు.జై శ్రీరామ్...జై శివాజీ...హైందవ నినాదంతో భారతావనిని చైతన్యపరిచేందుకే ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. హిందువులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శెట్టిపల్లె భూ బాధితులకు న్యాయం చేస్తాం



శెట్టిపల్లె భూములను పరిశీలిస్తున్న తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్

తిరుపతి మంగళం: ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్న శెట్టిపల్లె భూ బాధితులకు త్వరలోనే న్యాయం జరిగేలా చేస్తామని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి శెట్టిపల్లె భూములను ఆమె పరిశీలించారు. శెట్టిపల్లె భూ పరిరక్షణ కమిటీ నాయకులు, సీపీఎం, సీపీఐ నాయకులు, భూ బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమ భూములకు హక్కు కల్పిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారని కమిషనర్‌కు వారు వివరించారు. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో తమ సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని, తమకు న్యాయం చేసి తమ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్..శెట్టిపల్లె భూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ భూపతి, సీపీఎం నాయకులు సుబ్రమణ్యం, వేణు, శెట్టిపల్లె భూ పరిరక్షణ కమిటీ నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, రాజేంద్ర, సురేష్ పాల్గొన్నారు.